



ఉత్తుంగ సముద్ర తరంగాలవలె – గుబుళ్ళు ఉసుళ్ళయి మనస్సును కలగ బారగొడుతాయి మనిషిని మనిషిగా వుండనీయవు నవరంధ్రాల్ని మూసి వేసినట్లు యమబాధలకి గురి చేస్తాయి ప్రస్తుతం, అటువంటి అవస్థకి లోనయి వున్నారు తాతయ్య.

# అస్తిత్వం అంచున

## పొలుదాసు వెంకటేశ్వర రావు

తాతయ్య తలవంచుకుని నడుస్తున్నారు. ఆ నడకలో నిశ్చితత్వం లేదు నేవళంలేదు అతని బుర్ర నిండా ఆలోచనలే గుండెనిండా గుబుళ్లే మనసు మనసులో లేదు. బుర్ర గిర్రున తిరుగుతూవున్నది ఆలోచనలు ఆలోచనల్లాగాలేవు సుడిగాలుల్లాగ ఇట్టే వస్తాయి సంచలనం సృష్టిస్తాయి

ఈ బ్రతుకుబాటలో పయనిస్తూ వుండిన మనిషికి– అవస్థలు తప్పవు. బాధల బరువుల్ని మోసుకుంటూనే గతుకులదారి వెంబడి సాగిపోక తప్పదు. ఏ జీవికి, సంఘటనలు రకరకాల అనుభూతుల్ని అందిస్తాయి. కొన్ని తీపి గుర్తులు, మరెన్నో చేదుమాత్రలు బాధల్లో మునిగి వున్నప్పుడు, గుండెల్ని ఆనందంతో వూపివేసిన గతానుగతిక సంఘటనలు మనిషికి గుర్తురావు రక్తి జారిపోయి విరక్తి చోటు చేసుకుంటుంది ఈతిబాధలు చేసిన గాయాలు

భుజం మీద కత్తిపెట్టి గీరినట్లు నొప్పిగ అన్పించింది, నడుస్తున్న తాతయ్యకి

కసిగా తన్నిన ఒక కాకి, తపతపమని రెక్కల చప్పుడున్నూ

'కా, కా– అన్న 'కాకిగోల' చేసుకుంటూ– ఒక కాకి ఎగురుకుంటూ వెళ్ళి మర్రి చెట్టు కొమ్మని ఎక్కి కూర్చుంది తల ఒరిగించి కళ్ళు తిప్పింది. వెక్కిరిస్తున్నట్లుగ

'అమ్మా! నీయమ్మ!' అనుకుంటూ బుజం మీద తడిమి చూసుకున్నారు తాతయ్య ఎర్రగా రక్తం చేతికంటింది చురచురమంట ఒక పెద్దమనిషి లాగా తను తనదార్ని తలవంచుకుని నడిచి పోతూ వున్నాడుగదా! ఈ కాకి కావాలని కసిగా ఇట్టాతన్ని గాయం ఎందుకు చేసినట్లు?' అన్నిటికీ కారణాలు అవగతం కావు

'కా, కా' కాకి అరుస్తూ వుంది దాని కొంప కూలినట్లు పెరపెరలాడూ వుంది చురచుర చూస్తూ అడావుడి చేస్తూ వుందిగోల కాకిగోల

తను మర్చిపోయాడు, అవును

ఈ కాకి– గత నాల్గు దినాల్నుండి తన మీద దాడి చేస్తూ వుంది ఏ మూలనుండో ఎగిరివచ్చి తన్నుంది నెత్తిమీదో బుజంమీదనో ఒక పోటు పొడిచి పారిపోతుంది. ఇల్లు వదలి తను ఎక్కడికో పోవాలని దానివుద్దేశ్యంలాగుంది.

ఈ ఇల్లు తనది. తాత తండ్రాదులు ఇచ్చి పోయారు ఇంటి ముందు పెద్ద మర్రి చెట్టు దాని ప్రక్కనే వేపచెట్టు. రెండూ మానుల్లాగా అయి ఎత్తుగా ఎదిగి ఆకాశాన్నంటుతూ వుంటాయి. వాటి ప్రక్కనే పాతకాలంనాటి జామిచెట్టు వుంది కొమ్మలకి రెమ్మలు తొడిగి నిండుగా తెల్లని పూలు

పూస్తుంది ఆ పూలు నుండి గుత్తులు గుత్తులుగా జామికాయలు వస్తాయి రోజూ పోయేటప్పుడో లేక పొలంనుండి తిరిగి వచ్చినప్పుడో ఆ చెట్ల మధ్యన కాసేపు కాలక్షేపం చేస్తాడు ఆ ప్రక్కన వున్న దానిమ్మ చెట్టునిండా గుత్తులు గుత్తులుగా దానిమ్మకాయలు, పళ్లేలు త్రవ్వి, ఎరువువేసి నీళ్లు పెడతాడు ప్రతీ పువ్వునీ, పిందెనీ రోజూ చూపుల్తో తడివి ఆశీర్వదిస్తాడు అవి పెరిగి పెద్దవయి పక్వానికి రావాలని ఆశిస్తాడు ఆ ప్రక్కనే జాగావుంటే మడులుకట్టి టమాటా మొక్కలు నాటాడు రెపరెపలాడూ ఏపుగా ఎదిగి వచ్చి అవీ కాయలు కాసాయంటే మొక్కల మధ్యనా, చెట్ల క్రిందా పని చేస్తున్నప్పుడు అనిర్వచనీయ మయిన ఆనందానికి లోనవుతాడు తాతయ్య

మర్రి చెట్టుపైన, వేప వృక్షము మీదా రక రకాల పక్షులు తిష్ట వేసాయి చిలకలు, కాకులు, వడ్రంగి పిట్టలు, పిచికలు చేరి కల కలారావాలు చేస్తాయి ఉడుతలు చెంగు చెంగున కొమ్మమీద నుండి కొమ్మమీదికి గెంతుతూ కీచు కీచుమని ధ్వనులు చేస్తాయి అంతవరకూ బాగానే వుంది కాని, వాటి ముదనష్టపు పనులే తాతయ్యకి తలనొప్పిని తెచ్చిపెట్టాయి

బాగా తయారయినాక ఒకటిదు జామికాయల్నీ, తట్టెడు దానిమ్మ పళ్ళనీ, మూటెడు రకరకాలయిన కూరగాయల్నీ మోసుకుని వెళ్లి పట్నంలో కాపురం వుంటున్న కూతురికి ఇచ్చి రావాలన్న- తాతయ్య కోరిక భగ్న మయినప్పుడే- బాధ అన్పిస్తుంది. అపేక్షలు ఆక్రోశిస్తాయి, భంగపడినప్పుడు కొన్ని సంవత్సరాలుగా ఇది ఇట్లాగే కొనసాగుతూ వస్తున్నది విధ్వంసకాండ!

జామిపిందెలు గుట్టలు గుట్టలుగా రాలి నేలమీద రాసులవుతున్నాయి. అంతకాదు చెట్టుని వున్న జామికాయలు దానిమ్మ పండ్లూ- అన్నింటికీ తొర్రలే 'చిలకలు వూరుకోవు' చిక్కుడు పాదుకి పూసిన తెల్లని పూత కర్కశంగా త్రెంపివేయబడి నేలపాలవుతుంది వుడతలు ఆ వెధవపని చేసి ఏం పొముకుంటాయో తెలీదు ఎర్రరంగు వచ్చిన టమాటాల్ని బ్రతకనీవు ముంచులు పాదుల్ని కాయల్ని కొరికి పెడతాయి

'ఈటిమ్మా కడుపుమాడ! ఏమొచ్చిందీ వీటికి!' అని తిట్టుకుంటాడు అరిష్టం మాత్రం ఆగదు సాగిపోతూనే వుంటుంది బాధగాఅన్పిస్తుంది

'ఏయ్! ఏయ్!' అదిలిస్తాడు

వుడతలు బర్రు బర్రున పాకి వేపకొమ్మల చివర్లకు చేరి దొంగ చూపులు చూస్తాయి పక్షులు రెక్కల్ని టపటపలాడిస్తూ ఎగిరి పారిపోతాయ్ కాని ఏం లాభం? కొన్ని నిముషాల్లోనే మరల తిరిగివస్తాయి అంతామామూలే! విధ్వంసకాండ ఆగదు!!

'కా కా- గొంతు అర్చుకు పోయేటట్టు అరుస్తూనే వుంది

వీపు మంటగా వుంది చర్మం పొడిచిన కాడ చిమచిమ అంటూ వుంది

'నీయమ్మ!'- వంగి రాయి తీసుకుని విసిరాడు ఎగిరి అంతదూరం వెళ్లి- వెంటనే తిరిగివచ్చి యధాస్థానంలో వాలి, అరిచి గీపెట్టసాగింది, కాకి

'ఎందుకునాన్నా? వాటితో నీకు గొడవ?'- అనేది కూతురు, కాపురానికి వెళ్ళక ముందు 'పాపం! దిక్కులేని పక్షులుగదా' అని జాలిపడేది వాటిమీద

'దిక్కులేని పక్షులేగాని నా ప్రాణానికి రాక్షసుల్లాగా దాపురించాయి '- గొణిగేవాడు, తాతయ్య

'నాన్నా' నోరులేని జీవుల్ని దయగా చూడాలి మనం అని వాదించేది

'అమ్మా చూడు పూతల్ని తెంపేస్తున్నాయి పిందెల్ని రాల్చి పారేస్తున్నాయి మొక్కల్ని కొరికి వాట్ని చంపేస్తున్నాయి ఇవేం జీవులే బాబూ? ఇవన్నీ పూర్వ జన్మలో రాక్షసులయి వుండాలి'

'పోన్లే నాన్నా! వాటికి ఆకలి వుంటుందిగదా! ఆ మిగిలిందే మనది ఏం చేస్తాం?'

ఇట్లా ప్రతీదానికీ వాట్ని వెనకేసుకుని వచ్చేది కూతురు తను చిందులు వేసేవాడు వాదనలు చేసేవాడు కానీ- చిట్టితల్లి వాదనలని లోలోపల్నే మనస్ఫూర్తిగా ఆమోదించేవాడు-ఆనందించేవాడు పిచ్చివాదనలు పైపైనే

బిడ్డ అల్లారు ముద్దుగాపెరిగింది కళ్ళల్లోపెట్టి పెంచుకున్నారు ఇంటికి ఎన్నో కళా కాంతులు తెచ్చింది పదహారేళ్ళపాటు ఇంటిల్లిపాదికీ ఆనందం పంచిపెట్టి, పెళ్లి చేసుకుని నిర్దయగా అత్తవారింటికి తరలి వెళ్లింది ఆ తర్వాత పుట్టుకుని వచ్చాడు వంశోద్ధారకుడు వాడు చిచ్చరపిడుగు ఒకచోట కాల్నిలవడు మాటలు కోటలు దాటుతాయి అంతా తాత పోలిక

కూతురు అత్త మామలు మంచివారే కాని- అతనే! అతని బుద్ధి మంచిదిగాదని వార్తలు వచ్చాయి తర్వాత- అందువలన అదొక ఆందోళన తన కష్ట సుఖాల్ను ఎవరితోనూ, చెప్పుకోదు కూతురు అడిగినా పెదవివిప్పి బయట పడదు భూదేవిని తలుపుకు తెస్తుంది వాళ్ళ ద్వారా వీళ్ళద్వారా విని- గుండెలు మండి సెగలు గ్రక్కుతాయి అతను- ఏ నాడూ ఎవరికీ బయపడిందిలేదు దేనిగురించి బాధకి లోనయింది లేదుకాని ఈనాడు కూతురు గురించి-

'నాకేమిటి తక్కువ? నా అంతటివాడు ఎవడు?'- అని విర్రవీగిన అతని ఉక్కు గుండె బీటలువారింది 'అతను రాక్షసుడు దేవతలాంటి కూతుర్ని తెలీక అతనికిచ్చి గొంతుకోశాము' అని ఏడ్చేది తాతయ్య భార్య గుండెల్ని కోసే బాధ


'వాడ్ని నరుకుతాను' అని శివాలు ఎత్తేవాడు తాతయ్య, వుగ్ర నరసింహమయి 'వాల్లె వూరుకోండి ఏమిటా మాటలు?! ఎవరన్నా వింటె నవ్వుతారు ' అని హెచ్చరించేది భార్య కడుపులో ప్రజ్వలించుతూవున్న అగ్ని పర్వతం లాగా గుడగుడ ఉడికి పోయేవాడు తాతయ్య బాధతో బరువుగా క్రుంగిపోయేవాడు కన్నపేగులు ఆర్తితో మెలిదిరిగి పోయేవి

ఆ మధ్య కూతుర్ని చూసివస్తానని వెళ్ళి ముసలావిడ- గుండెలు బాదుకుంటూ మర్నాటికి తిరిగి వచ్చేది లబలబలాడేది కన్నీరు కడవలుగా శోకించేది 'ఏమే! ఏమయిందే!' అని అడిగితే, పిచ్చిగా చూస్తూ,

'అమ్మాయిన్నూ చూశారా?! అయ్యో! అయ్యో! అయ్యో!' అని మొత్తుకునేది ముక్కు చీదుకునేది

'ఇక్కడ వుండి చచ్చి- నే చెట్లా చూసేదే?! వెళ్లి చూసి వచ్చిందానివి' నువ్వుగదా! అమ్మాయి ఎట్లావుందీ? బాగానే వుందిగదా! సుఖంగా కాపురం






చేసుకుంటూ వుందిగదా!?'

'ప్చ్! అస్థిపంజరం లాగా అయి పోయిందండి- అని ముక్కు చీదుకుంది ఆమె. శోక తప్త అయి కళ్ళ వెంట కలవలతో కన్నీరు కార్చింది. రెండు దినాలు మంచం పట్టింది. అన్నం నోట బెట్టలేదు. కట్టెలాగ పడివుంది.

'ఎందుకట్లాగయిందని నువ్వు అడగలా?! మనలోపం ఏమిటంట?!

'అడిగాను'

'మరి ఏమంది?'

'ఏమి చెప్పుదు. చుట్టు ప్రక్కల వాళ్ళు చాటుగ మాటుగా చెప్పారు నాకు. అల్లుడు దాన్ని రాచి రంపాన పెడ్తాడట!- వుత్త పుణ్యానికేనట ఇదేమన్నా న్యాయంగా వుందా?!'

'వాడు అదేం మనిషి!? వాణ్ని చంపుతాను-' కళ్ళు ఎర్రగా అయి రౌద్రమూర్తి అవుతాడు

'హవ్వ! చాల్లే వూరుకోండి ఆ నోరు ఏం నోరు? అవతలి మనిషి ఎవరనీ- మీరు మాట మాటకీ చంపుతా అని అంటారు?'- అని తీక్షణంగా చూస్తుంది ఆమె. అతను చల్లబడి కూలబడవలసి వస్తుంది. కానీ- గుండెల్లో ఆక్రోశం ఎగసిపడుతుంది మనసు రంపపు కోతకి గురవుతుంది. చేతగానితనంతో, పిడికిళ్ళు బిగుసుకుంటాయి ఏదో చెయ్యాలని అనిపిస్తుంది ఏం చెయ్యాలో తోచదు. చెయ్యకుండా వుండాలన్నా మనసు వూరుకోక ఏం చెయ్యాల్నో తేలియదు విధి జీవితాలో్త అదే చెలగాటాలు, బ్రతుకు బాటలో భరించలేని గతుకులుగా తయారవ వచ్చుని- సులువుగా సాగే ప్రయాణం సమయంలో జీవుది కన్పించదు గాలిలో చల్లని పిల్ల తెమ్మెర తేలివచ్చింది. ఎంతదయ!

వ్యధిత మనస్సు నేలని, పులకింప జేస్తూ చిరుజల్లు రాలింది. ఎంత ప్రేమ!- చల్లని వార్త! కూతురు నీళ్ళు పోసుకుందని కబురువచ్చింది ముసలామె వెళ్ళి అత్తవారింటి దగ్గర్నుంచ

## అస్తిత్వం అంచున

కూతుర్ని తీసుకుని వచ్చింది ఇంటికి కళ వచ్చింద- బ్రతుకులో వసంతం తొంగిచూసినట్లు ముసలామె సంబరం చెప్పనలవికాదు బండి గట్టుకుని- పట్నం డాక్టరు దగ్గరికి తీసికెళ్ళి చూపించారు బాగా ఖర్చుపెట్టి మందులూ టానిక్కులూ, పళ్ళూ, ఫలాలూ కొన్నారు. కళ్ళల్లో పెట్టుకుని మాసుకున్నారు కూతురు తమ కళ్ళ ఎదుటవుంటే అదే పదివేలు. మరల బ్రతికి బట్టగట్టిన బ్రతుకు తీపి పది దినాలకే కూతురు వళ్ళు చేసింది. నిగ నిగలాడింది. లక్ష్మిలాగ ఇంటికి నిండుదనం తీసుకుని వచ్చింది. ఇంట్లో సంతోషం పండించింది. ముసలామెను పట్టుకోవటానికి పగ్గాలే లేవు కొడుకు ఆనందంతో చిందులువేస్తూ ఇంట్లోనూ బయటా, తిరిగాడు తాతయ్య సంగతి చెప్పనే పనిలేదు! కూతుర్ని వదిలిపెట్టడు

ఒకరోజు రాత్రివేళ అతన్ని- భార్య నిద్ర లేపింది. ఆదుర్దాపడూ్త

'లేవండి లేవండి మిమ్మల్నే-'

'ఏమిటే?!'

'త్వరగా లేవండి' అమ్మాయికి నొప్పులు వస్తున్నాయండి

పాపకి నొప్పులు వస్తున్నాయా?'- చివ్వున లేచాడు

'అవును వెంటనే పట్నం తీసుకెళ్ళాలి. తమ్ముడికి కబురంపాను మీరు వెళ్ళి జీతగాడ్ని తోలుకురాండి' వెళ్ళండి. వెళ్ళండి, ఆమె తరిమింది అతను పరుగులు పెట్టి, చీకట్లో పోయి, జీతగాడ్ని పిల్చుకువచ్చాడు బావమర్ది, భార్యా కలిసి, బండిమీద అమ్మాయిని డాక్టరుదగ్గరకి పట్నం తీసుకు వెళ్ళారు నేనూ వస్తానని గొడవపెట్టి కొడుకూ వాళ్ళతో పోయాడు చిచ్చరపిడుగు. అక్కండే ఎంతాపేక్షో

అది జరిగి పది దినాలయింది ఆందోళన తల్లడిల్లింపులు! ఏమవుతుందో?! కూతుర్ని హాస్పిటల్లో చేర్చారట తొలికాన్పు. వస్తూ పోతూ వుండే నొప్పులు కాన్పు అయ్యేదాకా అక్కడ్నే వుంచమన్నారట డబ్బుకావాలని బావమర్ది వచ్చాడు అప్పుచేసి అతనికి డబ్బు ఇచ్చి పంపాడు ఎంత ఖర్చయినా ఫర్వాలేదు తల్లీ బిడ్డా క్షేమంగా గండం గడిచి బయటపడ్తే అదే పదివేలు- క్షేమంగా ఇల్లు చేరితే అంతకంటే ఇంకా ఏం గావాలీ?

చటుక్కున ఎగిరివచ్చి నెత్తిమీద ఒక్కపోటు పొడిచింది, పొడిచి, ఎగిరి పారిపోయి చెట్టు ఎక్కింది కాకి.

'అమ్మ దీనమ్మ!' నెత్తిమీద తడుముకున్నాడు తాతయ్య నొప్పి

దీనికి బుర్రలేదు బుద్ధిలేదు ఎందుకు ఇట్లా తన వెనకాల్పు పడి బాధపెడూ్త వుంది? దానికి తనేం అపకారం చేశాడు!? అకారణమయిన ఈ దీనిదుష్ట చేష్టలకి, బ్రతుకులో విషాదాన్ని నింపే విధి చెయిదాలకీ, కారణాలు కనుక్కునే కథానాయకు డెవరు? విప్పి చెప్పగల వేదాంతి ఎక్కడ? దుర్వార్తని పట్టుకుని మొన్న ప్రొద్దు పోయాక తాతయ్యని వెదుక్కుంటూ, కూతురు అత్తవారింటి నుండి మనిషి వచ్చాడు ఆ వూర్లో ఎన్నో తగాదాలు ముఠాల్లు అనేక కక్షలు ఘర్షణ జరిగిందట వాళ్ళూ వీళ్ళూ ఎగబడి కొట్టుకున్నారట. కర్రలతో బరిసెలతో బాదుకుని, పొడుచుకున్నారట. ఆ దెబ్బలాటలో- ముందు నిలబడి పోరాడిన- అల్లుడు దారుణంగా పొడిచి చంపబడ్డాడట! తాతయ్య నెత్తిమీద పిడుగుపడింది. నెత్తి నోరూ కొట్టుకుంటూ ఆ మనిషి వెంటపడి వెళ్ళాడు. దహన సంస్కారాలు అయ్యేవరకూ వుండి, నెత్తిమీద తుండుగుడ్డ వేసుకుని నీరసంగా తిరిగివచ్చాడు నడుం విరిగినట్లయింది. ఇంకా ఎందుకు ఈ బ్రతుకు? అయిపోయింది. అంతా అయిపోయింది ఇది ఇట్లా ఎందుకు జరుగుతున్నదో తెలుసు 'కుంటానికి బుర్రబద్దలుగొట్టుకున్నంత లోపల్నే అంతా జరిగిపోయింది కూతురు పసుపు కుంకు మలు మాసిపోయాయి

ఆమె- చావు బ్రతుకుల్లో పట్నంలో పడివుంది ఈ విషయం ముసలామెకి తెలీదు తెలిస్తే, కడుపు చెరువయిపోయి, గుండెలు పగిలి పోగా, మూర్ఛపోతుంది, చచ్చి పోతానంటుంది. ఎందులోనన్నా దూకి చచ్చిపోవాలనే- తన ప్రయత్నం- ఆలోచన, ఇప్పటి పరిస్థితి ఇదీ తాతయ్యకి జీవితంలో ఇటువంటి పరిస్థితి ఎదురుకాలేదు అంత క్రితం ఇల్లు చేరి- ఎన్నడూలేనిది- చిన్న పిల్లవాడిలాగా వలవలా ఏడ్చాడు కంటికి తల ఒక కడివెడుగా కన్నీరు కారింది. గుండెలు రగిలి అగ్ని పర్వతపు సెగల్ని పొగలనీ వెలిగ్రక్కాయి మనసు ముక్కలూ చెక్కలు అయి ఛిన్నాభిన్నమయింది నవరంధ్రాలు మూసి వేసినట్లు గిలగిలలాడాడు ఆకలి దప్పులు మరిచి పోయి పిచ్చివాడిలాగా ఇంటి చుట్టూరా పొలాల వెంబడీ తిరిగాడు చచ్చిపోవాలని చాలా చాలా ఆలోచనలు చేసాడు కాని చాపల్యం చత నవలేదు

ఇంకా ఆ ఆలో చనా చావలేదు.

కస్సుమని– మరలా కసిగా పొడిచి ఎగిరిపోయింది కాకి ఆటగా వున్నట్లుంది దానికి నెత్తి మీదా, బుజాల మీదా కాకి చేసిన ఎన్నో గాయాలు ఆ పోటులకి వళ్ళు పచ్చి పుండులాగ అయింది నొప్పులు

పళ్ళు కొరుకుతూ కసిగా తలఎత్తి చూసాడు తాతయ్య పరీక్షగా పదే పదే చూసాడు ఎత్తున, వేపచెట్టు కొమ్మల సందున– ఎండుపుల్లలతో కాకి కట్టిన గూడు– అతని కళ్ళబడింది

'ఓహో ఇదా సంగతీ! ఇప్పుడు దీని అంతు చూస్తాను అనుకుని– ఇంట్లోకి పోయి పొడవాటి కర్ర చేతికి తీసుకున్నాడు ఆ గూడుని కూల్చివేస్తే– దిక్కులేని పక్షిలాగ అయి అదే వేరే చోటు చూసుకుంటుంది తిక్కకుదిరి– చెట్టు చేమల్ని పట్టుకుని అదే పోతుంది– అన్న నిర్ణయానికి వచ్చి వేపచెట్టుని పట్టుకుని పైకి ఎగబ్రాకాడు కోతిలాగా

'కాకా' కాకి, గోల బెట్టూ– అతని చుట్టూ ఎగురసాగింది ముక్కుతో, గోళ్ళతో– అతన్ని పొడవాలనీ, గీకాలనీ, గిచ్చాలనీ ప్రయత్నించింది కర్రతిప్పుతూ– మొండి పట్టుదలతో– కొమ్మలపైకి ఎగబ్రాకాడు తాతయ్య కళ్ళు కోపంతో ఎర్రగా అయ్యాయి నరాలు కసితో బిగుసుకున్నాయి పట్టుదలతో పైకిపాకి వెళ్ళాడు కర్ణ కఠోరంగా అరుస్తూ– కాకి ఎగిరివచ్చి నెత్తిమీద తన్ని పోయింది

'ఇవ్వాళ నీ అంతు చూస్తానే లం. ద' అని పళ్ళు పట పటా కొరికాడు తాతయ్య ,

కాకి అతన్ని వదిలిపెట్టలేదు గోలగోలగా అరిచి గీపెడ్తూ అతని చుట్టూ తిరుగుతూ వుంది తాతయ్య– తన పట్టుదలను వదిలిపెట్టలేదు వేపకొమ్మల్ని పట్టుకుని కోతిలాగా ప్రాకుతూ పైకివెళ్ళి కాకిగూడుని సమీపించాడు కర్రను ఎత్తి పట్టుకుని– కొమ్మల సందున కూర్చుని– గూడును కూలద్రోయటానికి వుపక్రమించాడు. రెండు చేతులోతూ, కర్రని ఎత్తి పట్టుకుని– బలం అంతా కూడతీసుకుని–

అతని చూపు గూడుమీద పడింది, ఆ క్షణంలో

ఆ గూట్లో ఆ పుల్లల సందున కాకారవాలు చేస్తూ రెండు కాకిపిల్లలు చిన్ని చిన్ని పిల్లలు! ఇంకా రెక్కలు సరిగా విచ్చుకున్నట్లులేదు! నల్లగా చిన్ని ముండలు! పాపం! ఇప్పుడు గూడుని కూలగొడితే–! అది రాలి నేలనుబడితే!–

అంతెత్తు మించి ఆ పసికూనలు క్రిందపడి– ప్రాణాలు పోతాయ్ గిలగిల్లాడి చస్తాయ్

'అయ్యో! వద్దు నాన్నా! పాపం!'– కూతురు, చెవిలో చెప్పినట్లయింది, బ్రతిమాలుతూ, ఆశ్చర్యంగా అటూ ఇటూ చూసాడు ఎవ్వరూలేరు అంతా తన భ్రమ! చక్రంలాగ ఈ ప్రపంచం క్షణ క్షణమూ తిరుగుతూ మార్పులకి లోనవుతూ వుంది! అందువలన ఇక్కడ ఎట్టిదీ ఏదీ శాశ్వతంకాదు జీవుల్ని భ్రమల్లోముంచి, సుఖదుఃఖానుభూతుల్ని విదిగా పంచటం– ప్రపంచ రంగ స్థలి మీద విధి ఆడిస్తున్న నాటకం 'నేను' అన్నది అసలు నీవుగాదు 'నాది' అన్నది నీదిగాదు వాస్తవ మిట్లా వుండగా– ఒక అర్భకపు తెలివిలేని పక్షిమీద నీకీ పంతమేల? కార్పణ్యంతో, పట్టుదలతో గూడును కూల్చి– నువ్వు ఏమి సాధించదలచినట్లు?– అని ఎవరో ప్రశ్నించినట్లు అన్పించింది

'కాకా'– కాకి గిజగిజలాడుతూ, గింగరాలు తిరుగుతూ, గోలగోల చేస్తూ అతని చుట్టూ ఎగురుతూవుంది భయంగా, ఆర్తిగా, నిస్సహాయముగా, వడుపుచూసి, బలంగా కర్రతో ఒక్కబాదు బాదాడు రాక్షసంగా అది గురితప్పి, ఆ వేపకొమ్మమీద, జరుగుతూ, గూడుని సమీపిస్తూ– పిల్లల్ని మ్రింగివేయాలన్న ఆనందాతిశయంతో, జరజరా పాకుతూ వున్న పాముతల మీద ఆ వేటుపడి విషజీవి అయిన సర్పం ఉంగలు చుట్టుకుని నేలమీద పడింది గిలగిలా కొట్టుకుంటూ. ఇతన్కి ఏదో తెల్సినట్లయింది ఆశ్చర్యంతో నోరు వెళ్ళబెట్టి– కాసేపు అలాగే చూసి– లజ్జితుడై తలవంచుకుని చెట్టు క్రిందకి వచ్చాడు తాతయ్య గిలగిల్లాడి చచ్చింది పాము

సర్ప కళేబరాన్ని కర్రతో ఎత్తి దూరాన్కి విసరివేసాడు

'కాకా'

చెట్టుకొమ్మ మీద కూర్చుని గోల పెట్టూవున్న


APL ఎ.పి. లైటింగ్స్ వారి విశిష్ట ఉత్పత్తులు ...

★ బల్బులు
★ ఫ్లోరసెంట్ ట్యూబులు
★ ఫిట్టింగులు
★ చోకులు, స్టార్టర్లు.....




నమ్మకానికి, నాణ్యతకు, సరసమైన ధరకు, సాటిలేనివి

నిజమే ! అందమైన గృహానికి మరింత శోభ కూర్చే అలంకారం !!

ఆంధ్రప్రదేశ్ లైటింగ్స్ లిమిటెడ్
(ఆంధ్రప్రదేశ్ పారిశ్రామికాభివృద్ధి కార్పొరేషన్‌కు అనుబంధ సంస్థ)
నారాయణగూడ, హైదరాబాదు-29.

# వేమన పద్యాలు




పగలు రేయి మఱచి భావంబు ఘఱచియు
తాను నేననియెడ తలపు మఱచి
యుండు నట్టివాడె యుత్తమ యోగియౌ
విశ్వదాభిరామ వినురవేమ

కాకి గొంతులో- కృతజ్ఞత నిండివున్నట్టు అన్పించింది బుద్ధి కర్మానుసారిణీ కార్యకారణ సంబంధాలు సాపేక్షకాలే అయినా ప్రయత్నంలేని అవలోకన వివరంగా అన్పించదు విశదముకాదు విషయం. కృషి కొరవడినప్పుడు.

'కాకా అని- టాటా చెప్తున్నట్టుగ అరిచి- కాకి ఎటో గాని ఎగిరిపోయింది. జామిచెట్టు క్రింద నేల మీద గుట్టలు గుట్టలుగా- పందెలు కొరికివేసిన కాయలూ దానిమ్మ చెట్టునవున్న కాయల్నిండా తొర్రలు! వుడుతల అగడాలకి రాలి నేలపాలయిన టమాటా పిందెలు, పాదుల మొదళ్ళల్లో పందికొక్కులు త్రవ్విన కలుగులు త్రెంపిన మొదళ్ళు, ఆకులూ అక్కడ్నే నిలబడి- ఆ విధ్వంసకాండని గమనిస్తూ కొన్ని నిముషాలు

## అస్తిత్వం అంచున

నిస్సహాయంగా చూసాడు నలువయిపులా- తాతయ్య నిట్టూర్చాడు

నాన్నోయ్! నాన్నా' నేను వచ్చేశానే'' గావుకేక

గేటు తీసుకుని కుర్రాడు బాణంలాగ వచ్చాడు కొడుకుని చూసి- తాతయ్య ప్రాణం లేచివచ్చి నట్లయింది! అతని చూపుల్లో జీవం- తిరిగి తొంగిచూసింది. చెదిరిన జుట్టుతో లాగుపైకి ఎగలాక్కుంటు నిలబడ్డ కొడుకు నెత్తిని అప్యాయంగా స్పృశించి-

'ఏంట్రా బాబూ! ఎట్లా వచ్చావు?'- అని అడిగాడు తాతయ్య.

'నేనా?! నడిచే వచ్చేశాను'

'నాన్నా' అక్కకి ఎట్లా వుందిరా? అమ్మ ఏమందీ? మామయ్య ఎప్పుడు వస్తాడూ?

'అది తర్వాత చెపుతాలే నాకొక్క అయిదు రూపాయలివ్వవా? సినిమా చూస్తానూ-'

'అక్కకి పురుడయిందా? అక్కడ అంతా ఎట్లా వున్నారు?!'

'అమ్మా! నేన్చెప్పకే! నా కయిదు రూపాయలివ్వందే నేనెందుకు చెప్పుతానూ' ఎలుకకి చెలగాటం పిల్లికి ప్రాణ సంకటం! రెండూ భ్రమకి లోనయిన జీవులే! అవసరాలకి బానిసలయి విధ్వంసనకుపక్రమించ గలిగినవే, వీలునిబట్టి.

'వెధవా! ఈబ్బగల గొడతాను చెప్పుతావా, చెప్పవా?'- గర్జించాడు.

వాడు ఏడ్పు లంకించుకున్నాడు.

'మరో అక్కకి బాబు పుట్టాడు ఈ సంగతి నాన్నకి చెప్పి నాన్నని వెంటనే తీసుకురారా- అని అమ్మ పంపితే కష్టపడి నడిచివస్తే- కొడతానంటావా, నాన్నా? ఏఏ'

'అక్కా బాబూ కులాసా వున్నారా?'- స్వరంలో రుద్ధత తాతయ్య కరిగిపోయాడు.

'కులాసాగానే వున్నారని చెప్పమందిలే అమ్మ. ఆ ఆ..'

'సర్లే- అట్లాగే ఇస్తాగాని వుర్కోరా మా నాన్నగదూ నీళ్ళు పోసుకుని నువ్వు బట్టలు మార్చుకో ఈలోగా నేను అన్నం వండుతాను. అన్నందినీ- అక్కదగ్గరకి పోదాం'

'నాకు అయిదు రూపాయలివ్వాలి మరీ'...

'అట్లాగే లేరా' ఇస్తానన్నానుగా.

'నిజంగా ఇవ్వాలీ- వుత్తగకాదూ..

తాతయ్యకి నవ్వు వచ్చింది.

'నిజంగా ఇస్తాలేరా. బుడ్డాడివి . కష్టపడి అంతదూరం నడిచి- మంచి కబురు తెచ్చావుగదా' అని- కొడకుని చెయ్యి పట్టుకుని లోపలికి నడిపించాడు. కొన్ని గంటల క్రితం చచ్చిపోదామను కున్నాడు తను చస్తే వీడి గతేంగాను?

చల్లని గాలి తెమ్మర వీచింది

'కాకా ఎక్కడినుంచో ఆహారం తీసుకునివచ్చి నోటికి అందిస్తూవున్న తల్లి కాకిని చూసి ఆనందంతో కాకి పిల్లలు హడావుడి చేస్తున్నాయి

అతని మనస్సు తేలికగా అయింది సంతోషపు చిగుళ్ళు వేసింది

అందివచ్చిన తాత్కాలికమయిన ఆనంద తరంగాలలో మునిగిపోయి వుబ్బితబ్బిబ్బయిన అతని మనస్సు- ముందు ముందు ఎదుర్కొనవలసి వున్న కఠోర సమస్యల అస్తిత్వాన్ని విస్మరించింది. తత్క్షణాన.

చేదు గతాన్ని లోతుల్లోపాతి- అయోమయంగా అన్పించగా, విషమ భవిష్యాన్ని విస్మరించి- అగమ్య గోచరమయినందున, కొద్ది ఆనందాన్ని అందించిన వర్తమానాన్నే స్మరించుకుంటూ పట్నానికి, ప్రయాణ సన్నాహాలు చేసుకోనటాన్కిగాను వుపక్రమించాడు అతను! □